క్లుప్తంగా

ఇష్టాగోష్టికి తరలిన నాయకులు



శాంతినగర్: మానవపాడు మండలం కలుకుంట్లలో ఆదివారం నిర్వహించిన టిఫిన్ డబ్బా ఇష్టా గోష్టి కార్యక్రమానికి వడ్డేపల్లి మండల బీజేపీ నాయకులు తరలివెళ్లారు. కలుకుంట్ల దత్తాత్రేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మోటార్‌సైకిళ్లపై బయల్దేరినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వడ్డేపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మోహన్, కోశాధికారి రాజశేఖర్, అయ్యారాజు, శేఖర్ పాల్గొన్నారు.

ఉద్యమనాయకుల సంస్మరణ సభ

అయిజ: మండలంలోని పులికల్‌కు చెందిన మద్దిలేటి, దేవన్నల సంస్మరణ సభను ఆదివారం పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ఉద్యమ నాయకులు జగపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంఈఓ ఎస్‌బి మేరమ్మ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పులికల్ దేవన్న, మద్దిలేటి చురుకుగా పాల్గొన్నారని కొనియాడారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

శాంతినగర్: ఇటిక్యాల మండలం బట్లదిన్నె గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆదివారం శాంతినగర్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇటిక్యాల మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణంతో నిలిచిన రాకపోకలు



అయిజ: పట్టణంలోని పాతబస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్యనున్న వాగుపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని తొలగించి కొత్తగా నిర్మిస్తున్నారు. అయితే ప్రజలు రాకపోకలు సాగించేందుకుగానూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. దీంతో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రహరీ నిర్మిస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఎటువైపు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు చౌడేశ్వరిమాత జయంతి



ఆత్మకూర్: తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరీ మాత జయంతి ఉత్సవాలు సోమవారం ఉదయం నిర్వహిస్తున్నామని, భక్తులు వేలాదిగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు. మండలంలోని తిప్పుడంపల్లిలో ఉదయం 6గంటల నుంచి మొదలుకొని చౌడేశ్వరీ మాత ఆలయంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్ర కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. భజన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బలరాం, నాయకులు పెరుమాళ్ల బాలరాజు, సత్యన్న, ఈశ్వరయ్య, పేరుమాల్ల సత్యన్న కోరారు.

ఎర్రమట్టి తరలింపునకు అనుమతి ఇవ్వాలి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఉన్న వివిధ గ్రామాల్లో గృహ నిర్మాణం ఇతర అవసరాల కోసం ఎర్రమట్టి కొట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్ కోరారు. సామాన్య ప్రజలు చిన్నపాటి నిర్మాణాలకు మట్టి తెచ్చుకోవాలన్న అనుమతుల పేరుతో స్థానిక అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులు మాత్రం మట్టిని ఎక్కడికి తీసుకెళ్లినా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మాత్రం అనుమతుల పేరుతో కొర్రీలు పెడుతున్నారని మండిపడ్డారు. కలెక్టర్ దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

వర్షాభావం..రైతన్న ఆగం

- వర్షాలు లేక వట్టిపోయిన చెరువులు, కుంటలు
- తగ్గిన భూగర్భజలాలు
- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాత

అయిజ: ప్రతి ఏడాది వానాకాలంలో నీటితో కళకళలాడే చెరువులు, కుంటలు.. ఈ ఏడాది వట్టిపోయి కళావిహీనంగా మారాయి. వానాకాలం ప్రారంభమై నెలరోజులైనా సరైన వర్షాలు లేకపోవడంతో నెర్రెలు బారాయి. ఆయకట్టు భూములు బీళ్లుగా మారుతున్నాయి. అయిజ గ్రామ శివారులోని కొత్త చెరువు, ఎక్లాస్‌పురం శివారులోని ఆచార్యుల చెరువు, ఎర్రకుంట, నల్లకుంట చెరువు, బి.తిమ్మాపూర్ శేషమ్మ చెరువు, ఉత్తనూరు శివారులో న్యూట్యాంక్ చెరువులు ఉన్నాయి. మిషన్ కాకతీయ పథకంలో చెరువు కట్టలను పటిష్ట పర్చడం, పూడిక తీయడం, అలుగుకట్ట నిర్మాణం వంటి పనులను చేపట్టారు. వర్షాభావ పరిస్థితులతో చెరువుల్లోకి నీరు చేరకపోవడంతో వట్టిపోతున్నాయి. బోరుబావుల్లో సైతం భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి. పంటలు ఎండుముఖం పడుతున్నాయి. వర్షాల కోసం రైతులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.



నీరులేక ఎండిపోయిన బి.తిమ్మాపూర్ శేషమ్మ చెరువు



ఎక్లాస్‌పురం శివారులో ఎండుముఖం పట్టిన వేరుశనగ పంట

పంటసాగు వివరాలు..

మండలంలో మొత్తం 57,637 ఎకరాలు సాగుకు అనుకూలమైన భూమి ఉండగా, 11,036 ఎకరాలు సాగుకు ప్రతికూలంగా ఉంది. ఈ ఏడాది వానాకాలంలో సుమారు 50వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగుచేశారు. జూన్‌లో అడపాదడప కురిసిన వర్షాలకు 12,402 ఎకరాల్లో కంది, 6,832 ఎకరాల్లో ఆముదం, 8,903 ఎకరాల్లో వేరుశనగ, 20,121 ఎకరాల్లో పత్తిపంట వేశారు. సుమారు 2వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగుచేశారు. వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండుమొఖం పట్టాయి.

చెరువులు, కుంటలు నిండలేదు..



ఈ ఏడాది వానాకాలం వచ్చి నెలరోజులు పూర్తయినా వర్షాలు లేక చెరువులు, కుంటలు నిండలేదు. ప్రతి సంవత్సరం ఏరువాక పున్నమికంటే ముందే ఏరులు నిండుగా పారేవి. బావులు పూర్తిగా ఎండిపోయాయి. బోరుబావుల్లో నీళ్లు అడుగంటిపోయాయి. సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

– తిరుమలరెడ్డి, అయిజ

పంటలు ఎండిపోతున్నాయి..



వర్షాలు లేకపోవడంతో సాగుచేసిన పంటలు ఎండిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. భూమిలో తేమశాతం ఎక్కువగా లేకపోవడంతో రైతులు ముందుగా సాగుచేసిన పత్తిపంటకు ఎర్రతెగులు సోకింది. దానితో మొక్కలు గిడుసబారి పెరుగదల లోపించింది. వాటిని తొలగించి రైతులు రెండవ సారి పత్తి పంటను సాగుచేశారు. సకాలంలో వర్షాలు కురువకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి.

– గోవిందు, అయిజ

నీటిని విడుదల చేయాలి..



అయిజ మండలం చుట్టూ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఉన్నాయి. ముచ్చోనిపల్లి రిజర్వాయర్‌లో నీళ్లు ఉన్నాయి. నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌లోపలి భాగంలో కొందరు వ్యక్తులు అక్రమంగా పంటలు సాగు చేసుకొని రిజర్వాయర్‌లో నీరు నిలువకుండా చేశారు. ఉన్నతాధికారులు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ద్వారా కాలువలు, చెరువులకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి.

– మేకల నాగిరెడ్డి, రైతుసంఘం మండల అధ్యక్షుడు, అయిజ

డ్రెయినేజీలు లేక అవస్థలు



ఎర్రవల్లి చౌరస్తాలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇండ్ల నుంచి వచ్చే మురుగు కాలనీల్లోనే నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు పందులు స్వైరవిహారం చేస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగలు, దోమల వ్యాప్తితో వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో డ్రెయినేజీలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ శేఖర్‌రెడ్డి ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులను ఆదివారం ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ నాయకులు పరామర్శించి రూ.60వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొంకతి వెంకటేష్, ధరూరు మండల అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, గట్టు మండల అధ్యక్షుడు నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ధరూరు: మండలంలోని అల్వాలపాడుకు చెందిన వెంకటన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆదివారం గ్రామానికి చేరుకొని వెంకటన్న పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మున్నాళ్ల ముచ్చట!

- నిర్మించిన నెలరోజులకే ధ్వంసమైన సీసీరోడ్డు

ధరూరు : ఏదైనా పని చేస్తే నాలుగు కాలాల పాటు ఉండాలన్నది పెద్దల మాట. నాలుగు కాలాలేమో కానీ కనీసం నాలుగు నెలలు కూడా కాకుండానే వేసిన సీసీరోడ్డు ధ్వంసమై అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పారుచర్ల గ్రామంలో నెలరోజుల కిందట రూ.5లక్షలతో సీసీరోడ్డు నిర్మించారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించకపోవడం వల్ల మున్నాళ్ల ముచ్చటగా మారింది. రోడ్డు మొత్తం కంకర తేలడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపమో లేక క్యూరింగ్ లోపమో తెలియదు కానీ.. రోడ్డు మాత్రం ఎందుకు పనికి రాకుండా పోతోంది. ద్విచక్ర వాహనాలు వెళ్తేనే కంకర తేలుతుందంటే నిర్మాణ పనులు ఏ విధంగా జరిగాయో అర్థమవుతోంది. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



పారుచర్లలో ధ్వంసమైన సీసీరోడ్డు

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూర్: మండలంలో చోరీకి గురి అయిన సెల్‌ఫోన్‌ను నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి ఆదివారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని ఆరేపల్లికి చెందిన సాయికుమార్ సెల్‌ఫోను నాలుగు రోజుల క్రితం చోరీకి గురయిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుగొన్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయినా.. లేదా పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు

- క్రీడాసామగ్రి, వసతులు కరువు
- చాలా చోట్ల పాఠశాలల్లోనే క్రీడాపాంగణాల ఏర్పాటు
- ఆటల నిర్వహణకు ఇబ్బందులు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

మానవపాడు: గ్రామీణ యువతలో క్రీడానైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. పలు గ్రామాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, లాంగ్‌జంప్ వంటి ఆటలకు సంబంధించిన సామగ్రి లేకపోవడం, వసతులు కల్పించకపోవడంతో క్రీడాకారులు వాటివైపు కన్నెత్తి చూడడంలేదు. ప్రతి గ్రామపంచాయతీలో రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు వెచ్చించి ఎకరా స్థలంలో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. మానవపాడు మండలంలో మొత్తం 16 జీపీలకుగానూ 14 గ్రామాల్లో నిర్మించారు. పల్లెపాడు, చంద్రశేఖర్‌నగర్ గ్రామాల్లో స్థల కొరతతో ఏర్పాటు చేయలేదు. చాలా గ్రామాల్లో పాఠశాల మైదానాల్లోనే క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల సమయంలో క్రీడల నిర్వహణకు ఇబ్బందికరంగా మారింది. క్రీడాకారులకు అనుకూలమైన ప్రాంతాల్లో కాకుండా పాఠశాల మైదానాలు, గ్రామాలకు దూరంగా క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. క్రీడాప్రాంగణాల్లో క్రీడాకారులకు అవసరమైన సామగ్రి, వసతులు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్దపోతులపాడు పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం

క్రీడాకారులకు అందుబాటులో ఉండాలి..



గ్రామాల్లో ఎకరా స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడం హర్షణీయం. గ్రామీణ ప్రాంతాల్లో మైదానాలు లేక యువత ఆటలకు దూరమవుతున్నారు. అన్ని గ్రామాల్లో అందరికీ అందుబాటులో ఉండేలా క్రీడాప్రాంగణాలను నిర్మిస్తే బాగుంటుంది. అసంపూర్తిగా ఉన్న క్రీడాప్రాంగణాలను పూర్తి చేసి క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించాలి.

– మోహన్‌బాబు, చెన్నిపాడు

పాఠశాలల్లో ఏర్పాటుతో ఇబ్బందులు..



క్రీడాప్రాంగణాలను పాఠశాలల్లో ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒకవైపు పాఠశాల తరగతులు కొనసాగుతుంటే, మరోవైపు యువత ఆటలు ఎలా ఆడుతారు? అందరికీ అనువైన ప్రాంతాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని అనుకూల ప్రాంతాల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేయాలి.

– నాగేష్, మానవపాడు

ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు..

మండలంలోని 16 గ్రామపంచాయతీల్లో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ స్థలం ఎక్కడ ఉంటే అక్కడ నిర్మిస్తున్నాం. క్రీడాప్రాంగణాల్లో అవసరమైన సామగ్రి, వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. క్రీడాప్రాంగణాలను యువత సద్వినియోగం చేసుకోవాలి.

– రమణరావు, ఎంపీడీఓ, మానవపాడు

బీటీరోడ్డు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

అయిజ: సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన ‘నత్తనడకన పనులు’ కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారిపై బీటీ నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.5.50 కోట్లతో చేపట్టిన రోడ్డు వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు ముందుకు సాగకపోవడం, రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. దీంతో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు బీటీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాక్షికి అభినందనలు తెలిపారు.



పట్టణంలో చేపట్టిన బీటీరోడ్డు నిర్మాణ పనులు

మార్పు కోసం మహా ఉద్యమం



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అమరచింత: దగాపడ్డ తెలంగాణలో విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ ‘మార్పు కోసం మహా ఉద్యమం’ అనే కార్యక్రమాన్ని ఆగస్టు 1న హైదరబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జిల్లా నాయకుడు వినోద్, మండల కన్వీనర్ అఖిల్ తెలిపారు. మార్పు కోసం మహా ఉద్యమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం మండలంలోని హైస్కూల్ ఆవరణలో విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1.91లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేష్, ప్రశాంత్, బాలు, భరత్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ఆత్మకూర్: పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో హరహర మహాదేవ శంభోశంకర పాహిమాం అంటూ శివనామ స్మరణతో మార్మోగింది. మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుడికి రుద్రాభిషేకం, బిల్వాభిషేకం, జలాభిషేకం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు శివానందస్వామి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివస్వాముల సంఘం నాయకులు బాలకృష్ణ, బాల్‌రాజు, అంజి, శ్రీధర్, రవిందర్, రాము, భవాని సంఘం నిర్వాహకులు భారతి, నాగలక్ష్మి, సత్యన్న, ఈశ్వరమ్మ, వెంకటమ్మ, మార్కెట్ కార్యదర్శి శేఖర్, భక్తులు పాల్గొన్నారు.



శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..

మెగా వైద్య శిబిరం

పెబ్బేరు రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు సీఎస్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో లేబరు కార్డు కలిగిన 45 మంది భవన నిర్మాణ కార్మికులు, గ్రామస్తులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఎస్ హెల్త్ జిల్లా కోర్డినేటర్ నరేష్ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏఎల్‌ఓ వేణుగోపాల్, వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



గట్టులో బతుకమ్మ ఆడుతున్న పంచాయతీ కార్మికులు

గట్టు : సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన పంచాయతీ కార్మికులు ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

శాంతినగర్ : గ్రామపంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐతోపాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వడ్డేపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరంలో మాట్లాడుతూ కార్మికులను రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో మధు, శాంతిరాజు, కల్యాణ్, ప్రకాశం, శ్రీనివాసులు, తిమ్మప్ప, రత్నమయ్య పాల్గొన్నారు.



మల్దకల్‌లో..

మల్దకల్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల ఆందోళన కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు వెంకటన్న, సత్యన్న, గోపాల్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ప్రమాదబీమా కల్పించడంతోపాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

పెబ్బేరు రూరల్: ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన ఉండాలని, రోజూ భగవద్గీత చదవడంతో మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి పెబ్బేరు కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి పెబ్బేరు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత శ్లోకాల గురించి వివరించారు. గ్రామంలోని కొంత మందికి భగవద్గీత, ఆధ్యాత్మిత గ్రంథాలను పంపిణీ చేశారు. రవి, వెంకట్రాంలు, సురేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని నర్సింగాపురంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక కొత్తకోట మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి మట్లాడుతూ గురువు ‘గుణాతీతుడు, రూపవర్జితుడు, గుణంలో మలినం లేనివాడన్నారు. పరమాత్మ కూడా ఆది అంతం లేని వాడు కాబట్టి అలా పోల్చారని దేవుడే మనిషిగా జన్మిస్తే ఆయనను మాత్రమే గురువుగా భావించాలని సూచించారు.